క్లుప్తంగా

ట్రై సైకిల్ పంపిణీ



ట్రై సైకిల్ అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నందికొట్కూరు: పట్టణంలోని 11వ వార్డుకు చెందిన దివ్యాంగుడు రాజుకు వైఎస్సార్‌సీపీ 11 వార్డు ఇన్‌చార్జ్ రజనీ కుమార్ ఆదివారం ట్రై సైకిల్‌ను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర శాప్‌చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి సహకారంతో ట్రై సైకిల్ అందజేసినట్లు చెప్పారు. గతంలో ఓ ట్రై సైకిల్ ఇవ్వడం జరిగిందని, అది మరమ్మత్తులకు గురై పని చేయడం లేదనే విషయం తెలియడంతో మళ్లీ అందజేశారని వివరించారు. కార్యక్రమంలో శాప్ జిల్లా కో ఆర్డినేటర్ స్వామిదాసు, రవి కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు కిరణ్‌కుమార్ రెడ్డి, పీఎంసీ చైర్మన్ చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

పాములపాడులో పాముల బెడద



పాములపాడు: స్థానిక ఎస్సీ కాలనీలోని వైఎస్ఆర్ నగర్‌లో పాముల బెడద ఎక్కువైంది. కాలనీలోని ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు, కంప చెట్లు విపరీతంగా పెరిగాయి. ఇవి పాములకు ఆవాసాలుగా మారాయి. పగలు, రాత్రి తేడా లేకుండా విషసర్పాల సంచారం అధికమైంది. కంటబడిన పాములు కాలనీవాసుల చేతిలో హతమవుతున్నాయి. విషసర్పాల నుంచి ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని భయాందోళకు గురౌతున్నారు. అధికారులు స్పందించి కాలనీకి విద్యుత్ సరఫరాతో పాటు కంప చెట్ల తొలగింపు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

పోస్టర్ల విడుదల

ఆత్మకూరు: విజయవాడలో ఈనెల 9న జరగనున్న మాజీ కేంద్ర మంత్రి ములాయంసింగ్ విగ్రహా విష్కరణ పోస్టర్‌ను బీసీ జాతీయ సంక్షేమ సంఘం నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో యాదవ సంఘం జిల్లా నాయకులు, ఆత్మకూరు మార్కెట్‌యార్డ్ చైర్మన్ మన్యం బాలస్వామియాదవ్, అఖిలభారత యాదవ మహాసభ కన్వీనర్ రఘురాముడు ఏ యాదవ్‌లు మాట్లాడుతూ ఈ నెల 9న విజయవాడ నగరంలో మాజీ ముఖ్యమంత్రి, సమాజవాదీ పార్టీ జాతీయ అధ్యక్షులు అఖిలేష్ యాదవ్ ఆధ్వర్యంలో విగ్రహావిష్కరణ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అఖిల భారత బీసీ సంక్షేమ సంఘం నాయకులు, కన్వీనర్ శివరామకృష్ణ, రమణ, నాగన్నయాదవ్, రవిప్రకాష్ యాదవ్, రామకృష్ణయాదవ్, నారాయణయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రవేశ పరీక్షకు 88 మంది హాజరు



పరీక్షా హాలులో పరిశీలిస్తున్న ప్రిన్సిపల్

పాములపాడు: స్థానిక ఏపీ మోడల్‌స్కూలులో ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్షకు 88 మంది విద్యార్థులు హాజరు కాగా ఒక్కరు గైర్హాజరైనట్లు ప్రిన్సిపల్ నాగరవీంద్ర తెలిపారు. స్కూలులో 7,8,9 తరగతులలో ఖాళీగా ఉన్న సీట్లకు దరఖాస్తులు కోరిన విషయం విధితమే. ఇందుకు గాను 89 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నట్లు ఆయన తెలిపారు. త్వరలో ఫలితాలు తెలియజేసి మెరిట్‌ప్రకారం విద్యార్థులకు సీట్లు కేటాయిస్తామని తెలిపారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్‌ఐ కృష్ణమూర్తి

ఆత్మకూరురూరల్: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆత్మకూరు ఎస్‌ఐ కృష్ణమూర్తి రౌడీషీటర్లను హెచ్చరించారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో ఆదివారం ఆయన రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలో అమాయకులను అక్రమంగా నిర్బంధించి వారిని హింసిస్తున్నట్లు తమకు సమాచారముందని, అలాంటి వారిని ఉపేక్షించేది లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బయలు ప్రదేశాలలో మద్యపానం చేయడం, మద్య సేవించి వాహనాలు నడిపి ప్రమాదాలకు కారకులవుతున్న వారిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు.

తప్పిన పెనుప్రమాదం

మహానంది: మండల కేంద్రమైన ఎం.తిమ్మాపురం గ్రామంలో ఆదివారం పెనుప్రమాదం తప్పింది. పసుపు బస్తాలతో వెళ్తున్న ఓ ట్రాక్టర్ స్థానిక మీ సేవా రోడ్డు సమీపంలో విద్యుత్ స్తంభానికి తగలడంతో అది విరిగింది. అదృష్టవశాత్తు స్తంభం కింద పడకపోవడంతో పెద్దప్రమాదం తప్పడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. వెంటనే స్థానికులు సబ్‌స్టేషన్ సిబ్బందికి ఫోన్‌చేసి సమాచారం ఇవ్వడంతో సరఫరా నిలిపేశారు.

పడిగాపులు కాసే బాధలు తప్పాయి



నడవలేని స్థితిలో ఉన్న జూపాడుబంగ్లా మండలం భాస్కరాపురం గ్రామానికి లింగమ్మకు ఇంటివద్దకు వెళ్లి వలంటీరు సుభాషిణి వేలిముద్ర వేయించుకొని చేతిలో పింఛన్ నగదు పెట్టడంతో ఆమె సంతోషించారు. టీడీపీ పాలనలో పింఛన్ కోసం తిండీ తిప్పలు మానుకొని పంచాయతీ కార్యాలయం వద్ద పడిగాపులు కాయాల్సి వచ్చేదని, తన మనుమడు జగన్ సీఎం అయ్యాక పింఛన్ కోసం ఎక్కడికీ వెళ్లకుండా తెల్లవారకముందే ఇంటి వద్దకే వచ్చి పింఛన్ సొమ్ము చేతిలో పెడ్తున్నారని ఆనందం వ్యక్తం చేసింది.

లబ్ధిదారుల చెంతకే పింఛన్



పాములపాడు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వృద్ధాప్య, వితంతు, వికలాంగులు ఎక్కడున్నా అక్కడికి వెళ్లి నగదు అందిస్తున్నారు. మండలంలోని మద్దూరు గ్రామానికి చెందిన పింఛన్ దారురాలు బోయ సరస్వతి అనారోగ్యంతో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో 15 రోజుల నుంచి చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న వెల్ఫేర్ అసిస్టెంటు సంధ్య అక్కడికి వెళ్లి నగదు అందజేశారు. దీంతో గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తెల్లవారకముందే పింఛన్

- జూపాడుబంగ్లా మండలంలో 94.09శాతం పింఛన్ల పంపిణీ పూర్తి
- జిల్లాలో ఏడో స్థానం

జూపాడుబంగ్లా: రెండోరోజైన ఆదివారం కూడా మండలంలోని వివిధ గ్రామాల్లో పింఛన్ల పంపిణీ కొనసాగింది. మండలం వ్యాప్తంగా 4,990 మందికి పలురకాల పింఛన్లు మంజూరు కాగా వారిలో 4,695 మందికి పింఛన్లు పంపిణీ చేసి 94.09శాతంతో జిల్లాలో ఏడో స్థానంలో నిలిచినట్లు ఎంపీడీఓ సుబ్రమణ్యశర్మ తెలిపారు. మిగిలిన 295మందికి పింఛన్లు పంపిణీ చేసి వందశాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేస్తామన్నారు. నియోజకవర్గంలోని నందికొట్కూరులో 5,104 పింఛన్లు మంజూరు కాగా 47,338 పంపిణీ చేశారు. మిడుతూరులో 5,354 పింఛన్లకు గాను 5,050, నందికొట్కూరు అర్బన్‌లో 4,744కు గాను 4,416 పింఛన్లు పంపిణీ చేశారు. పాములపాడులో 5,698 పింఛన్లకు గాను 5,257, కొత్తపల్లిలో 4,173 గాను 3,842, పగిడ్యాలలో 4,775 పింఛన్లుకు గాను 4,365 మందికి నగదు అందజేసినట్లు అధికారులు వెల్లడించారు.

ఖరీఫ్ ఆశలు సజీవం!

- మొలక దశలో ముందస్తుగా వేసుకున్న విత్తనాలు
- విత్తు వేసేందుకు రైతన్నలు సిద్ధం
- సరైన వర్షాల కోసం ఎదురుచూపు



నందికుంట వద్ద మొలకెత్తుతున్న పత్తి పంట



మొలకెత్తుతున్న మొక్కజొన్న పంట

కొత్తపల్లి: వ్యవసాయంపై ఆధారపడి ఎంతో మంది జీవనం సాగిస్తున్నారు. రైతన్నకు ప్రకృతి ఒక్కోసారి పంటలు బాగా పండేల సహరిస్తే, మరోసారి నష్టాలను మిగిలిస్తుంది. అయితే ఈ ఏడాది కూడా కొంత మంది రైతన్నలు తొలకరి వర్షాలకు ఆరుతడి పంటలను ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసుకుంటున్నారు. మరికొంత మంది మరో మారు మంచి వర్షాలు పడితే సాగుచేసు కునేందుకు సిద్ధంగా ఉన్నారు. అయితే జూన్ మాసం పూర్తయినా సరైన వర్షాలు కురువకపోవడంతో వరణుడు ముఖం చాటేశాడేమోనన్న ఆందోళనలో రైతన్నలు ఉన్నారు. కాగా ఇటీవల కురిసిన వర్షాలకు ముందస్తుగా వేసుకొన్న విత్తనాలు మొలకెత్తడంతో వారి ఆశ సజీవంగానే ఉందనే సంతోషంలో ఉన్నారు.

ముందస్తుగా మొక్కజొన్న, పత్తి సాగు..

మండలంలో సాధారణ సాగు విస్తీర్ణం 21,542.5 ఎకరాలు కాగా ఇప్పటికే ముందస్తుగా రైతన్నలు మొక్కజొన్న, పత్తి విత్తనాలు వేశారు. మొక్కజొన్న 300, పత్తి 250 సాగుచేయగా.. ఇటీవల కురిసిన అరకొర వర్షాలకు మొలకెత్తాయి. మరికొందరు ఇంకా వర్షాలు కురిస్తే విత్తనం వేసేందుకు సిద్ధంగా ఉన్నారు. ప్రతి రోజు వినీలాకాశాన్ని చూస్తూ వేచి చూస్తుండగా మేఘాలు మాత్రం అప్పుడో, ఇప్పుడో వర్షిస్తాయి అన్నవిధంగా కారుమబ్బులు కమ్మేసి చివరకు రైతన్నకు నిరాశనే మిగులుస్తున్నాయి. జూలై మాసంలోనైనా వరణుడు రైతన్నను కరుణించకపోడా అని కర్షకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

అన్ని సిద్ధం చేసుకున్నాం



ఖరీఫ్ సీజన్‌కు పంటలను సాగుచేసుకొనేందుకు విత్తనాలు, మందులు అన్ని సిద్ధం చేసుకున్నాం. వర్షం పడిందే మొదలు అందరం విత్తనాలు వేసుకునేందుకు ఎదురు చూస్తున్నాం. ప్రతిరోజు వర్షం వచ్చేలా మేఘాలు వచ్చి పోతున్నాయి తప్ప వర్షం పడకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఈ నెలలోనైనా మంచి రీ వర్షాలు పడితే ఖరీఫ్ సాగుకు భయం ఉండదు.

– చంద్రబాబు, రైతు, గువ్వలకుంట్ల

నేడు గురుపౌర్ణమి వేడుకలు

ఆత్మకూరు: పట్టణంలోని సాయిబాబ దేవాలయంలో సోమవారం గురుపౌర్ణమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు దేవస్థానం కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ గురుపౌర్ణమి సందర్భంగా శ్రీసాయిబాబ దేవాలయంలో షిరిడీ సాయిబాబ ప్రత్యేక అలంకరణ తో దర్శనంతో పాటు పల్లకీ సేవ, రథోత్సవం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమం విజయవంతం చేసేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.

కొత్తపల్లి: గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని సోమవారం గువ్వలకుంట్ల శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయంలో జరిగే వేడుకలను భక్తులు విజయవంతం చేయాలని ఆలయ పురోహితులు సూర్యప్రకాశ్ ఆదివారం కోరారు. అదేవిధంగా మండలంలోని శివపురం గ్రామ సమీపంలోని నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన కొలనుభారతిదేవి క్షేత్రంలో విశేష పూజాకార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పురోహితులు శ్రీనివాస శర్మ తెలిపారు.

కడమలకాల్వలో పారిశుద్ధ్య పనులు

మహానంది: బండిఆత్మకూరు మండలం కడమలకాల్వ గ్రామంలో పలువురు అస్వస్థతకు గురవ్వడంతో అధికారులు పారిశుద్ధ్య పనులపై దృష్టి సారించారు. ఎంపీడీఓ వాసుదేవగుప్త ఆదేశాల మేరకు సిబ్బంది ఆదివారం గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. దీంతో పాటు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో గ్రామస్తులకు ట్యాంకర్ల ద్వారా తాగునీరు అందిస్తున్నారు.

మహానందిలో వర్షం

మహానంది: మండలంలో ఆదివారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. మహానంది పుణ్యక్షేత్రంతో పాటు మండల పరిధిలోని గ్రామాల్లో వర్షం కురవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. పంటపొలాలను సాగుకు సిద్ధం చేసుకున్న రైతులు కొద్దిరోజుల నుంచి వర్షం కోసం ఎదురు చూస్తున్నారు. మహానంది ఆలయంలో వర్షం రాకతో భక్తులు తడవకుండా ఉండేందుకు ఆలయ ఆవరణలోని సుపథ మండపాల వైపు పరుగులు తీశారు.

బహిరంగ వేలం వాయిదా

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలదేవ స్థానంలో హక్కు భుక్తులలో గల 64 ప్లాట్లకు సంబంధించి ఈ నెల 5న నిర్వహించాల్సి ఉంది. కానీ అనివార్యకారణాల వలన బహిరంగ వేలంను వాయిదా వేసినట్లు ఆలయాధికారులు ఆదివారం తెలిపారు.

ఆధ్యాత్మికం

భ్రామరికి లక్షకుంకుమార్చన



లక్షకుంకుమార్చన పరోక్ష సేవగా నిర్వహిస్తున్న అర్చకులు, వేదపండితులు

శ్రీశైలంటెంపుల్: అష్టాదశ శక్తిపీఠంగా వెలసిన శ్రీశైల శ్రీభ్రమరాంబాదేవికి ఆషాఢశుద్ధ పౌర్ణమి సందర్భంగా ఆదివారం లక్షకుంకుమార్చన పూజలను నిర్వహించారు. పూజలో భక్తుల పరోక్ష సేవగా పాల్గొనేందుకు దేవస్థానం అవకాశం కల్పించింది. ఇందులో భాగంగా అర్చకులు, వేదపండితులు ముందుగా పూజా సంకల్పాన్ని పఠించారు. కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతి పూజను నిర్వహించారు. అనంతరం లక్షకుంకుమార్చనను జరిపించారు. శ్రీశైలక్షేత్రానికి స్వయంగా విచ్చేయలేని భక్తులు వారి గోత్రనామాలతో లక్షకుంకుమార్చన ఆర్జిన పరోక్ష సేవకు ఆన్‌లైన్ ద్వారా రూ.1016లు చెల్లించాల్సి ఉంటుంది.

మహానందిలో నేడు శాకాంబరీ ఉత్సవం



ఉత్సవానికి కూరగాయలను సిద్ధం చేస్తున్న దృశ్యం

మహానంది: మహానంది దేవస్థానంలో సోమవారం శాకంబరీ ఉత్సవం నిర్వహిస్తున్నట్లు ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఉత్సవానికి సంబంధించిన ఏర్పాట్లు చేపట్టారు. ఈఓ మాట్లాడుతూ ఆషాఢమాసం, పౌర్ణమి సందర్భంగా అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో అలంకరించి శాకంబరీ ఉత్సవాన్ని చేస్తామన్నారు. వేదపండితులు రవిశంకర అవధాని మాట్లాడుతూ శాకంబరీ అలంకారంలో శ్రీ కామేశ్వరీదేవికి అలంకరణ చేసి పూజలు చేయడం ద్వారా కరువు, కాటకాలు ఉండవన్నారు. అందరూ సుభిక్షంగా ఉండాలన్న సంకల్పంతో ప్రతి ఏడాది ఉత్సవం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ ఉత్సవానికి గత కొన్నేళ్లుగా నంద్యాలకు చెందిన కూరగాయల వ్యాపారి టి.ప్రసాద్, ఆదిలక్ష్మమ్మ దంపతులు ఉచితంగా కూరగాయలు అందిస్తున్నారు.

సేవల్లో లోపాలపై ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయవచ్చు



మహానందీశ్వరుడి దర్శనార్థం వచ్చిన చైర్మన్ కరణం కిషోర్‌కుమార్, కుటుంబ సభ్యులు

మహానంది: వినియోగదారుల వివాదాల, సేవల్లో లోపాలకు సంబంధించిన ఫిర్యాదులను ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవచ్చని కర్నూలు జిల్లా వినియోగదారుల కమిషన్ చైర్మన్ కరణం కిషోర్‌కుమార్ తెలిపారు. కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం మహానంది వచ్చిన ఆయన శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకున్నారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ షాపుల్లో వస్తువులను ఎమ్మార్పీ కంటే అధికంగా వసూలు చేసినా, నాణ్యతలో లోపం ఉన్నా ఫిర్యాదులు ఇవ్వొచ్చన్నారు. షాపుల్లో బిల్లులు ఇవ్వలేని పక్షంలో పోన్‌పే చేసే సమయంలో కొనుకున్న వస్తువుల వివరాలను జతపరుస్తూ ఫిర్యాదు చేయొచ్చని తెలిపారు. కమిషన్‌లో ఫిర్యాదు దాఖలైన 90రోజుల్లోనే కేసులను పరిష్కరించుకునేందుకు కృషి చేస్తున్నామన్నారు.

రక్తదానం



రక్తదానం చేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): స్థానిక సీఐటీయూ జిల్లా కార్యాలయంలో వ్యవస్థాపక అధ్యక్షుడు సత్యనారాయణ శత జయంతి ఉత్సవాల సందర్భంగా ఆదివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, ఉపాధ్యక్షుడు రమేష్ కుమార్ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ వివిధ వ్యాధులతో బాధ పడుతున్న వారికి అందజేసేందుకు ఆరేళ్లగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. 40 మంది రక్తదానం చేసినట్లు వారు తెలిపారు. ఏసురత్నం, తోటమద్దులు, గౌస్, ఎల్లయ్య,బాలవెంకట్, పుల్లా నరసింహ, లక్ష్మణ్ వెంకటరావు, తిరుపతయ్య పాల్గొన్నారు.

ముగిసిన గంగ జాతర

దొర్నిపాడు: మండలంలోని రామచంద్రాపురం గ్రామంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న గంగమ్మ జాతర ఆదివారం ముగిసింది. గ్రామస్తులు అమ్మవారికి పెద్దసంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకొని పొలేటి యాగం, బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. జాతరతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

భక్తిశ్రద్ధలతో పెద్దమ్మకు పూజలు

మండలంలోని డబ్ల్యూ.గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయమే అమ్మవారికి అభిషేకాలు, హారతులు పట్టి ప్రత్యేకంగా అలంకరించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భారీగా భక్తులు చీర,సారె, పిండి వంటలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

పంటల బీమా మంజూరు

గోస్పాడు: గత ఖరీఫ్‌లో పంటలు నష్టపోయిన రైతులకు బీమా మంజూరైందని మండల వ్యవసాయ అధికారి స్వప్నిక తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూగత ఖరీఫ్ సీజన్‌లో పత్తి, వరి, ఉల్లి పంటలు సాగుచేసి సరైన దిగుబడులు రాక నష్టపోయిన 675 మంది రైతులకు రూ.1.39 కోట్ల పంటల బీమా మంజూరైందని, జాబితాను ఆర్బీకేల్లో అందుబాటులో ఉంచామని, ఏవైనా అభ్యంతరాలుంటే ఈ నెల 4 వ తేదీ లోపు స్థానిక రైతు భరోసా కేంద్రాల్లో తెలియజేయాలని సూచించారు. త్వరలో రైతుల ఖాతాల్లో బీమా మొత్తం జమవుతుందని వివరించారు.

క్రేన్ ఢీకొని వృద్ధుడి మృతి

నందికొట్కూరు: పట్టణంలో ఓ వృద్ధుడిని క్రేన్ ఢీకొన్న సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో నంద్యాల రోడ్డు దాటుతుండగా క్రేన్ ఢీకొట్టిన సంఘటనలో ముర్తుజావలికి(70) తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులకు సమాచారం తెలియడంతో 108లో కర్నూలు ప్రభుత్వం వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ ప్రభుత్వ వైద్యశాలలో కోలుకోలేక మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడు హాజీనగర్‌కు చెందినవాడు, మసీదుల వద్ద భిక్షాటన చేసి జీవనం సాగించేవాడు. ఈ ఘటనపై ఎలాంటి పిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

ఆత్మకూరు: మండలంలో గతేడాది అతివృష్టి, అనావృష్టి వల్ల నష్టపోయిన రైతులకు పంట నష్టపరిహారం చెల్లించాలని ఆత్మకూరు రైతు సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు అష్రఫ్‌అలీ కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ గతేడాది ఖరీఫ్‌లో మొక్కజొన్న పత్తి పంటలు సాగు చేసి నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పంట బీమా సొమ్మును చెల్లించాలన్నారు. అత్యధిక సంఖ్యలో రైతులు పంటలు సాగు చేసి నష్టపరిహారం రాకపోవడం విచారకరమన్నారు.

ఆకతాయిలకు పోలీసుల హెచ్చరికలు

మహానంది: స్థానిక కోనేరులలో స్నానాల పేరుతో అల్లరిచేస్తున్న ఆకతాయిలకు దేవస్థానం ఉద్యోగులు, పోలీసులు ఆదివారం హెచ్చరికలు చేశారు. నంద్యాల పట్టణంలోని పలు ప్రాంతాలకు చెందిన కొందరు ఆకతాయిలు మహానందికి వచ్చారు. స్థానిక చిన్నకోనేరులో ఈలలు, కేకలు వేయడంతో పాటు మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో భక్తులు ఆందోళనకు దిగారు. వారిని బయటికి పిలిచి హెచ్చరికలు చేసి ఆలయం నుంచి పంపిచేయడంతో వివాదం సద్దుమణిగింది. ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతుండటంతో నంద్యాల పట్టణానికి చెందిన బీజేపీ, విశ్వ హిందూ పరిషత్, హిందూ ధార్మిక సంస్థల ప్రతినిధులు ఆలయానికి చేరుకుని అధికారులతో చర్చించారు.

ఖబరస్తాన్ విషయంపై వివాదం

మహానంది: బుక్కాపురం గ్రామంలోని మసీదు వద్ద ఉన్న ముస్లింల ఖబరస్తాన్(శ్మశానవాటిక) విషయంలో వివాదం నెలకొనడంతో పంచాయతీ పోలీస్‌స్టేషన్‌కు చేరింది. స్థానిక మసీదు వద్ద పక్కన ఉన్న శ్మశానవాటిక వద్ద అంత్యక్రియలకు స్థలం అనువుగా లేకపోవడంతో స్థలాన్ని చదును చేసే క్రమంలో ఓ వర్గానికి చెందిన ఇద్దరు మహిళలు ఆందోళనకు దిగారు.వివాదం ఆదివారం పోలీస్‌స్టేషన్ వరకు చేరడంతో ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ ఇరు వర్గాల వారితో చర్చించారు. శాంతియుతంగా సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

నంద్యాల(న్యూటౌన్): భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి శంకర్ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ఇతర రంగాలకు నిధులను మళ్లించకుండా కార్మికుల సంక్షేమ పథకాలకు కేటాయించాలన్నారు. 60 సంవత్సరాలు నిండిన భవన నిర్మాణ కార్మికునికి రూ.5 వేలు పెన్షన్ ఇవ్వాలని, పేద కార్మికులకు ఇళ్ల నిర్మించి ఇవ్వాలని కోరారు. ఇర్ఫాన్, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రఫీ, మహబూబ్ బాషా, మున్నా, సయ్యద్, ఆంజనేయులు పాల్గొన్నారు.

ముమ్మరంగా మొక్కజొన్న విత్తు



ట్రాక్టర్‌తో మొక్కజొన్న విత్తనం వేస్తున్న దృశ్యం

పాములపాడు: ఇటీవల కురిసిన వర్షంతో రైతులు ఖరీఫ్ పనులు ప్రారంభించారు. మండలంలో ప్రధాన పంటైన మొక్కజొన్న విత్తనాలను రైతులు పొలాల్లో విత్తుతున్నారు. మండలంలోని బానుముక్కల, బానకచెర్ల, జూటూరు, తుమ్మలూరు, కంబాలపల్లి గ్రామాల్లో ముమ్మరంగా సాగుకు సమాయత్తమయ్యారు. ప్రస్తుతం విత్తనం వేస్తే మరో వారం రోజుల్లో తేలికపాటి వర్షం కురిసినా ఫర్వాలేదు మొలకెత్తే అవకాశం ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు. పొలాల్లో లోతు సేద్యాలు చేసిన భూమిలో ప్రస్తుతం కురిసిన వర్షం తో పదును కాలేదని, మరో వర్షం కురిస్తే వేసేందుకు సన్నద్ధమతున్నారు. ఏది ఏమైనా ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో పొలాల్లో రైతులు బిజీగా గడుపుతున్నారు.

సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకోండి



వరి విత్తనాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

జూపాడుబంగ్లా: రైతు భరోసా కేంద్రాల్లో రాయితీపై మంజూరు చేస్తున్న విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ కృష్ణారెడ్డి తెలిపారు. ఆదివారం తాటిపాడు గ్రామంలోని రైతుభరోసా కేంద్రంలో రైతులకు వరి విత్తనాలను పంపిణీ చేశారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామాల వారీగా వరి, కంది, పెసలు, మినుములు తదితర విత్తనాలను ఇప్పటికే రైతులకు అందజేసినట్లు తెలిపారు. తాటిపాడు గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో బీపీటీ-5204రకం కర్నూలు సోన వరి విత్తనాలను క్వింటాలు రూ.3,940లు కాగా రూ.1,750లు రాయితీపోను రైతులకు రూ.2,190లు అందజేస్తున్నామన్నారు. గ్రామానికి చెందిన 50 మంది రైతులకు రాయితీ వరి విత్తనాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. అలాగే 80బన్నూరు గ్రామంలో ఎన్‌డీఎల్‌ఆర్-7 నంద్యాల సోన వరి విత్తనాలను రాయితీపై రైతులకు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. ఇంకా అవసరమైన రైతులు రైతుభరోసా కేంద్రాల్లో పేర్లు నమోదుచేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్బీకే వీఏఏ అబ్దుల్లా, రైతులు పాల్గొన్నారు.



ఏడు వర్ణాలతో విరిసిన ఇంద్రధనస్సు

ఆకట్టుకున్న ఇంద్రధనస్సు

ఆత్మకూరు: పట్టణంలో ఆదివారం సాయంత్రం సప్తవర్ణాలతో ఇంద్రధనస్సు వెల్లువిరిసింది. ఆకాశం కారుమబ్బులతో కమ్ముకుని చిరుజల్లులు కురిసి మేఘాలు మాయం కాగా...వెను వెంటనే ఏడు రంగుల ఇంద్రధనస్సు పట్టణ ప్రజలను అబ్బురపరిచింది.

వైభవంగా శ్రీశైలగిరి ప్రదక్షిణ



గిరిప్రదక్షిణ నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం ఆధ్వర్యంలో ఆషాఢ పౌర్ణమిని పురస్కరించుకుని వైభవంగా శ్రీశైలగిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదివారం సాయంత్రం సంప్రదాయబద్ధంగా శ్రీస్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకీలో ఉంచి అర్చకులు, వేదపండితులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో పల్లకీ సేవ జరిపించారు. ఆతర్వాత ఆలయ మహాద్వారం నుంచి మొదలైన ఈ ప్రదక్షిణ గంగాధర మండపం, అంకాలమ్మ ఆలయం, నందిమండపం, మల్లికార్జున సదన్, బయలువీరభద్రస్వామి ఆలయం, అక్కడి నుంచి రింగ్‌రోడ్డు మీదుగా గణేషసదనం, సారంగధర మండపం, గోశాల, మల్లమ్మ కన్నీరు, పుష్కరిణి వద్దకు చేరుకుంది. అక్కడి నుంచి తిరిగి నందిమండపం వద్దకు, అక్కడ నుంచి ఆలయ మహాద్వారం వద్దకు గిరిప్రదక్షిణ చేరుకుంది. ఇల కైలాసంగా ప్రసిద్ధమైన శ్రీశైలమహాక్షేత్రంలో గిరిప్రదక్షిణ చేయడం ఎంతో ఫలప్రదంగా పురాణాలు చెప్పబడుతున్నాయి.